క్లుప్తంగా

వైభవంగా స్వామివారికి లక్షపత్రి పూజలు


పూజలు అందుకున్న స్వామివారు

నిడదవోలు: స్థానిక రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం స్వామివారికి 640వ లక్షపత్రి పూజ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, ఈవో నామా సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌పై ఆరోపణల్లో నిజం లేదు

కొవ్వూరు: ఆర్టీసీ కొవ్వూరు డిపో మేనేజర్ వీవీ కుమార్‌పై బహుజన ఎంప్లాయూస్ వెల్ఫేర్ యూనియన్ నాయకులు చేస్తున్న ఆరోపణలు నిజం కాదని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ఎస్ వాసు ఆదివారం పేర్కొన్నారు. డిపోలో చార్టును అనుసరించి నిబంధనలకు అనుగుణంగానే డ్యూటీలు వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మేనేజర్‌పై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని వాసు హితవు పలికారు. వ్యక్తిగతంగా కొంత మంది ఉద్యోగులను ఇబ్బంది పెట్టేలా ఆరోపణలు చేయడం, పేర్లతో ఫిర్యాదు చేయడం సమజసం కాదన్నారు .ఆ సంఘ నాయకులు చేస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోవాలని ఓ ప్రకటనలో కోరారు.

వరద బాధితులకు చిన్నారుల విరాళం

నిడదవోలు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఇద్దరు చిన్నారులు ఆర్థిక సాయం అందించారు. ఉండ్రాజవరం మండలం కాల్దారి గ్రామానికి చెందిన చిన్నారులు కోమటిపల్లి లాస్యవి, ముళ్లపూడి హరిమోక్షితలు తాము దాచుకున్న రూ.10,457 మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించారు. వారీ మొత్తాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు అందించి, ఆయన ద్వారా సీఎం సహాయనిధికి పంపించారు.

10న ఆర్టీసీ పార్శిల్ కార్యాలయంలో వేలం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ఆర్టీసీ పార్శిల్ ఆఫీస్‌లో అన్‌క్లెయిమ్డ్, అన్ ఐడెంటిఫైడ్ వస్తువులకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(కమర్షియల్) మాధవ్ ఆదివారం ప్రకటించారు. రాజమహేంద్రవరం బస్‌స్టేషన్‌లో ఉన్న పార్శిల్ బుకింగ్ ఆఫీస్ వద్ద మంగళవారం ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు బహిరంగ వేలంలో పాల్గొని వస్తువులను సొంతం చేసుకోవచ్చునన్నారు.

శరన్నవరాత్ర ఉత్సవాలకు శ్రీకారం

కడియం: స్థానిక దేవి గుడి వద్ద ఆదివారం పందిరి రాట ముహూర్తం నిర్వహించి శరన్నవరాత్ర ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సమాయత్తమయ్యారు. కార్యక్రమంలో శ్రీవిఘ్నేశ్వర తాపీ పనివారల సంఘం సభ్యులు, దేవీ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీదేవి నవరాత్రులకు రాట ముహూర్తం

సీటీఆర్ఐ: రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన దేవి చౌక్ శ్రీబాలాత్రిపుర సుందరీ దేవి దసరా ఉత్సవాలకు సంబంధించి స్థానిక దేవిచౌక్ వద్ద ఆదివారం ఉదయం 7.28 గంటలకు రాట ముహూర్తం నిర్వహించారు. 91వ శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలకు రాట ముహూర్తంతో నాంది పలికారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రహసనంగా ఉపాధ్యాయుల పని సర్దుబాటు

కంబాలచెరువు(కంబాలచెరువు): ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ ఒక ప్రహసనంగా మారిందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.జయశంకర్ అన్నారు. యూటీఎఫ్ తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జయశంకర్ మాట్లాడుతూ మొత్తం ప్రక్రియ రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలో కేంద్రీకృతం చేసి ఆన్‌లైన్ చేయడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మా ట్లాడుతూ ఉపాధ్యాయులు ఉత్తమ బోధనా పద్ధతులను అందిపుచ్చుకుని విద్య బోధన చేయడమే కాకుండా దేశ స్థితిగతులను మార్చే విద్యార్థులను తయారు చేసే విధంగా ఉండాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణకుమారి మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ నిరంతరం సర్దుబాటు ప్రక్రియలో ఉన్న ఇబ్బందులను తొలగించడానికి కృషి చేస్తుందన్నారు.


దేవరపల్లి మెరక వీధి వినాయకుడి గుడిలో స్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైఎస్సార్ సీపీ శ్రేణులు


తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో గణనాథునికి సర్పంచ్ పరశురామారావు తదితరుల పూజలు


నల్లజర్ల మండలం పోతవరంలో గణనాథునికి పూజలు చేస్తున్న భక్తులు


కొవ్వూరు మెరక వీధి వాటర్ ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన భారీ గణనాథుడిని దర్శించుకుంటున్న భక్తులు

భజే గణనాథా..

- విఘ్నాధిపతిని మనసారా కొలిచిన భక్తులు
- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- వీధివీధినా కొలువుతీరిన పార్వతీ తనయుడు
- తొమ్మిది రోజుల పాటు పూజలు


నిడదవోలు గణేశ్ చౌక్ సెంటర్‌లోని పూజా గణపతి కుమార స్వామివారికి భక్తుల పూజలు


సమిశ్రగూడెం నెహ్రూ బొమ్మ సెంటర్లో గణనాథుడిని దర్శించుకుంటున్న బాల గణేష్ యూత్ సభ్యులు


ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో లక్ష్మీగణపతి స్వామి గుడి వద్ద భక్తుల సందడి

చాగల్లు: ఆది దేవుడైన విఘ్నాధిపతిని భక్తులు మనసారా కొలుస్తున్నారు. వినాయక చవితి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గణపతి నవరాత్ర వేడుకలు కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలగా సంఘం ఆధ్వర్యంలో చాగల్లు వినాయకుని గుడి వద్ద 108 మంది దంపతులు పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్, ఉత్సవ కమిటీ నిర్వాహకుడు గంద్రోతు సురేంద్రకుమార్, తెలగా సంఘ పెద్దలు ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే చాగల్లు-నెలటూరు వర్తక సంఘం వినాయకుని గుడి వద్ద శనివారం కలశస్థాపన పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ గ్రంథి రాంబాబు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు రెండుచోట్లా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. యజమానులు తమ కార్లు, లారీలు, మోటార్ సైకిళ్లకు పూజలు జరిపించారు. అలాగే మండలంలోని బ్రాహ్మణగూడెం నడివీధిలోను, మెయిన్ రోడ్డులోను, ఊనగట్ల, మార్కొండపాడు, చిక్కాల, దారవరం, ఎస్.ముప్పవరం తదితర గ్రామాల్లో చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

తాళ్లపూడి: గణపతి నవరాత్ర వేడుకలతో మండల వ్యాప్తంగా సందడి నెలకొంది. అన్ని గ్రామాల్లోనూ ఏర్పాటు చేసిన మంటపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు మొదలు పెట్టారు. వేగేశ్వరపురంలోని కాలువ గట్టు వినాయక, ఆంజనేయ స్వామి గుడుల వద్ద, తుమాలమ్మ ఆలయం వద్ద, శివాలయం వద్ద, వడ్డీల రామాలయం వద్ద గణనాథుని విగ్రహాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు పూజలు చేశారు. తాళ్లపూడి బస్టాండ్ సెంటర్ వద్ద భారీ మట్టి గణనాథుడిని ప్రతిష్ఠించి వేడుకలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రక్కిలంకలో లక్ష్మీగణపతి ఆటోమోటార్ వర్కర్స్ ఆధ్వర్యంలోను ఉత్సవాలు జరుగుతున్నాయి. పెద్దేవంలో సంపతి వినాయక ఆలయం వద్ద, పైడిమెట్ట, గజ్జరం, అన్నదేవరపేట, బల్లిపాడు, రావూరుపాడు, మలకపల్లి, తాడిపూడి తదితర గ్రామాల్లోనూ చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

దేవరపల్లి: వినాయక చవితి ఉత్సవాలతో గ్రామాలు కోలాహలంగా మారాయి. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు గణపతి మంటపాలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. దేవరపల్లిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మంటపాలను ఎంపీపీ కేవీకే దుర్గారావు, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డి.సువర్ణరాజు, టీడీపీ మండల నాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, ఆయా పార్టీల శ్రేణులు సందర్శించి గణనాథులను దర్శించుకుని పూజలు చేశారు.

నల్లజర్ల: విఘ్నాలు తొలగించి, విజయాలు ప్రసాదించే ఆదిదేవుడు వినాయకుడు బహురూపాల్లో భక్తులకు కనువిందు చేస్తున్నాడు. పోతవరంలోని వరసిద్ధి వినాయక గుడిలో అబ్బూరి నరేష్ దంపతులు పూజలు నిర్వహించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్వామివారిని దర్శించుకొన్నారు. నల్లజర్ల సెంటర్లో వరసిద్ధి వినాయక చవితి 42వ వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. గుండుమోగుల సోమేశ్వరరావు, మాధవి దంపతులు ఉత్సవ విగ్రహాన్ని అందజేశారు.మండలంలోని మొత్తం 70 మంటపాల్లో ఉత్సవాలు జరుగుతున్నాయి. అనంతపల్లి కూడలిలోని సిద్ధివినాయక ఆలయాన్ని రూ.3 లక్షలతో పునర్నిర్మించి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తెలికిచెర్ల, దూబచర్ల వైఎస్సార్ వసంత నగర్ కాలనీల్లో ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు.

పూజా గణపతికి వేలాది మంది పూజలు

నిడదవోలు: స్థానిక గణేశ్ చౌక్‌లోని పూజాగణపతి కుమారస్వామి గుడి వద్ద 102వ గణపతి నవరాత్ర వార్షికోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉప్పులూరి వీరభద్రరావు, ఆదిలక్ష్మి సరస్వతి దంపతుల ఆర్థిక తోడ్పాటుతో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన 16 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శనివారం సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ భారీ ఎత్తున ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ, గణపతి ఆలయం విద్యుత్ సెట్టింగ్, దేవతామూర్తుల లైటింగ్ ఆకట్టుకుంటున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, సరిదే సత్యం, లంకంసాని సూర్యారావు, కన్వీనర్ కారింకి నాగేశ్వరరావు, తోలేటి కోటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అలాగే స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో సిద్ధివినాయక, కుమార సబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల ఆలయంలోనూ గణనాథుని ఉత్సవాలు జరుగుతున్నాయి. గౌడ వీధి వినాయక ఆలయంలోను, యాదవులు వీధి, ఉజ్జినవారి వీధి, పంగిడి రోడ్డు, రాయిపేట తదితర వినాయక ఆలయాల వద్ద ఉత్సవాల సందడి నెలకొంది.

నిడదవోలు రూరల్: నవరాత్ర పూజలకు మండలంలోని వివిధ గ్రామాల్లో గణనాథులు కొలువుదీరారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. భక్తులంతా మంటపాలు, ఇళ్ల వద్ద రకరకాల పండ్లు, పూలు, పత్రులతో అలంకరించి మట్టి వినాయకుని ప్రతిమ వద్ద కట్టి కుడుములు, ఉండ్రాలు నైవేద్యాలుగా పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. సమిశ్రగూడెం, డి.ముప్పవరం, కలవచర్ల, పెండ్యాల, శెట్టిపేట, పందలపర్రు, తాడిమళ్ల, గోపవరం, పురుషోత్తపల్లి, కోరుమామిడి తదితర గ్రామాల్లో వివిధ రూపాల్లో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు.

ఉండ్రాజవరం: వేలివెన్ను గాంధీబొమ్మ సెంటర్లో ప్రతిష్ఠించిన లక్ష్మీ గణపతిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. సూర్యారావుపాలెం కమ్మవారి వినాయకుడి గుడి వద్ద స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం బాణసంచా కాల్పులు, బుట్టబొమ్మలు, విచిత్ర వేషధారణలు, తీన్‌మార్, డప్పు వాయిద్యాలతో స్వామివారి విగ్రహాన్ని వాహనంలో గ్రామ వీధుల్లో ఊరేగించి జలాశయంలో నిమజ్జనం చేశారు. అలాగే ఉండ్రాజవరం, తాడిపర్రు, మోర్త, పాలంగి, చివటం తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాలను కూడా ఊరేగించి, నిమజ్జనం చేశారు.


చాగల్లు వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమ


చాగల్లు తెలగా సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం

వీధివీధినా సందడే .. సందడి


కొవ్వూరు లాంచీల రేవు వినాయక శిబిరం వద్ద ఆకట్టుకుంటున్న దేవతామూర్తుల సెట్టింగ్

కొవ్వూరు: పట్టణంలోని వీధివీధినా వినాయక చవితి సందడి నెలకొంది. మెరకవీధి వాటర్ ట్యాంకు జంక్షన్ వద్ద రౌండ్ రామాలయం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడ్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు తదితర ప్రముఖులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. లాంచీల రేవుల వినాయక మంటపం వద్ద దేవతామూర్తులతో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్ చూపరులను కట్టుకుంటోంది. అనన్య థియేటర్ సెంటర్, గాయత్రీ థియేటర్ ఎదురు గా, ఫ్యాక్టరీ రోడ్డులో రెల్లి పేట యూత్ ఆధ్వర్యంలో, ఏటిగట్టుపై కోదండ రామాలయం వద్ద వివిధ రూపాల్లో ప్రతిష్ఠించిన భారీ విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. రంగుల విద్యుత్ కాంతులతో ప్రత్యేకం రూపొందించిన శిబిరాల్లో గణనాథులు కొలువు తీరి పూజలందుకుంటున్నారు. పట్టణంలోని ఏ వీధికి వెళ్లిన వినాయకుడి చవితి ఉత్సవాల సందడి కనిపిస్తోంది.అపార్టుమెంట్లు, వివిధ కూడళ్లలోను, కాలనీల్లోను వినాయక ఉత్సవ శిబిరాలు వెలిశాయి.

ఉధృతంగా ఎర్ర కాలువ


నిడదవోలు మండలం కంసాలిపాలెం వద్ద ఎర్ర కాలువ ప్రవాహ ఉధృతిని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి దుర్గేష్, తహసీల్దార్ నాగరాజు నాయక్

- పరిశీలించిన అధికారులు
- రోజంతా ఏకధాటిగా కురిసిన వర్షం

నిడదవోలు రూరల్: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ఎర్ర కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వరద నీరు పోటెత్తడంతో నిడదవోలు మండలంలోని కంసాలిపాలెం- మాధవరం వంతెన వద్ద నీటి ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. మరోవైపు ఆదివారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో మండలంలోని సమిశ్రగూడెం, డి.ముప్పవరం, తిమ్మరాజుపాలెం, రావిమెట్ల, కాటకోటేశ్వరం గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. రోజంతా వర్షం పడుతుండడంతో జన జీవనం స్తంభించింది. ప్రజలు ఇళ్లు విడిచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఎర్ర కాలువ ఉధృతిని మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, తహసీల్దార్ నాగరాజు నాయక్ ఆదివారం పరిశీలించారు. ఏటిగట్ల పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు.

3,900 క్యూసెక్కుల విడుదల

నల్లజర్ల: మండలంలో ఎర్ర కాలువ నీటిమట్టం స్వల్పంగా పెరిగింది. ఆదివారం ఉదయం అనంతపల్లి హైడ్రాలజీ ప్రాజెక్ట్ వద్ద 50 సెంటీమీటర్లుగా ఉన్న కాలువ నీటిమట్టం మధ్యాహ్నం 3 గంటలకు ఒక మీటరుకు పెరిగింది. జంగారెడ్డిగూడెం మండలం, కొంగువారిగూడెం జలాశయం నుంచి 3,900 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదులుతున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఎర్ర కాలువ పరీవాహక ప్రాంతంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీనికితోడు దిగువన బయనేరు, పులివాగుల నుంచి వచ్చే వరద నీరు కలవడంతో ఎర్ర కాలువ నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు ఎప్పటికపుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

వరద బాధితులకు రేషన్, దుస్తుల పంపిణీ


విజయవాడలో వరద బాధితులకు నిత్యావసర సరకులు, దుస్తులు పంపిణీ చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

గోపాలపురం: విజయవాడ వరద బాధితులకు మానవత సంస్థ గోపాలపురం మండల శాఖ సభ్యులు నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. మండలంలోని దాతల నుంచి నగదు, వస్తువుల రూపంలోనూ రూ.ఐదు లక్షల విలువైన రేషన్, దుస్తులు సేకరించారు. ఈ సామగ్రిని మానవత సంస్థ సభ్యులు లారీలో విజయవాడ తరలించారు. ఆ సామగ్రిని విజయవాడలో ట్రాక్టర్లకు లోడ్ చేయించి లోతట్టు ప్రాంతాల వరద బాధితులకు అందజేశారు. ఈ విధుల్లో 50 మంది మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నట్టు ఆ సంస్థ మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, అధ్యక్షుడు పప్పు సత్య కృష్ణారెడ్డి తెలిపారు. కాగా తాము అడిగిన వెంటనే వరద బాధితుల సహాయార్థం ముందుకు వచ్చి సాయం చేసిన మండల ప్రజలకు మానవత సంస్థ మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, అధ్యక్షుడు సత్యకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.


తాళ్లపూడి మండలం బల్లిపాడులో వ్యాధిగ్రస్తురాలికి మానవత సంస్థ ఆర్థిక సాయం

వృద్ధురాలికి ఆర్థిక సాయం

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడుకు చెందిన వంటరి మహిళ కొప్పాక సరోజిని ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతోంది. పేదరాలైన ఆమె వైద్య ఖర్చులకు కూడా ఇబ్బంది పడుతోంది. ఈ విషయం తెలిసిన మానవత సేవా సంస్థ మండల శాఖ సభ్యులు ఆదివారం బల్లిపాడు గ్రామంలోని ఆమె ఇంటికి వెళ్లి రూ.6 వేల ఆర్థిక సాయం చేశారు.ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు అంకెం సురేష్ కుమార్ చేతులమీదుగా ఈ మొత్తాన్ని సరోజినికి అందించారు. కార్యక్రమంలో సంస్థ ఈసీ మెంబర్ కొప్పాక వెంకటేశ్వరరావు, ససపల రాజశేఖర్, వల్లభనేని వీర్రాజు, తలారి రామమోహన్, ఆదాడి వెంకటేష్, గోళ్ల అనిల్, ఖండవల్లి లాజర్ , మరికొందరు పాల్గొన్నారు.

జీవో నంబరు 84ని రద్దు చేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జీవో నంబర్ 84ని రద్దు చేసి, పాత విధానంలోనే మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు జరపాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా శాఖ రెండో కార్యవర్గ సమావేశాన్ని బుధవారం స్థానిక దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ 117 జీవో వల్ల విద్యా వ్యవస్థ నష్టపోతుందన్నారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తూ విద్యార్థుల సంఖ్య పెరగడానికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. సీపీఎస్ స్థానంలో ఓపీఎస్‌ను తప్ప ఏ ఇతర ప్రత్యామ్నాయాలను ఉపాధ్యాయులు ఒప్పుకోరని ఆయన స్పష్టం చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా జీతాలు క్రెడిట్ అయ్యేలా చేయడంలో ఎస్టీయూ కృషి చేసిందని ఆయన గుర్తు చేశారు. కోర్టులో ఉన్న పండిట్స్ వివాదాన్ని త్వరలో పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు స్వీకరించిన ఉపాధ్యాయులను ఆయన సత్కరించారు.

వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయం


దేవరపల్లిలో కురుస్తున్న వాన


దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఇంటిలోకి చేరిన నీరు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో రెండు రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. పల్లపు ప్రాంతాలు ఇప్పటికే జలమయం అయ్యాయి. ఎక్కడికక్కడ రోడ్లు చిత్తడిగా మారాయి. శనివారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తున్నందున జన జీవనం స్తంభించింది. రహదారులు గుంతలు పడి అధ్వానంగా ఉన్నాయి. మండలంలోని యర్నగూడెంలో పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో రెండేళ్లుగా వర్షం నీరు ఇళ్లల్లోకి చేరుతోందని, అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి రాణి నీట మునిగిన గృహాలు, డ్రైనేజీలను పరిశీలించారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. భారీ వర్షాలు అన్నదాతలను కలవర పరుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడి వాయుగుండం ప్రభావంతో రాబోయే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. పంట చెరువులు నిండి చెక్ డ్యామ్‌ల ద్వారా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువలు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉండడంతో పరీవాహక ప్రాంతాల్లోని రైతులు ఎటువంటి ముంపు వాటిల్లుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఇళ్లకే పరిమితమైన జనాలు

నిడదవోలు: అల్పపీడనం ప్రభావంతో రెండు రోజుల తర్వాత మళ్ళీ ముసురు పట్టింది. నిడదవోలు పరిసర ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రజలు నానా ఇబ్బందులూ పడుతున్నారు. చిరు వ్యాపులు, ఫుట్‌పాత్ వ్యాపారులు వర్షం కారణంగా బేరాలు లేకపోవడంతో తెచ్చుకున్న సరుకు అమ్ముడుపోకపోవడంతో నష్టపోయారు. విద్యుత్ సరఫరాకు పలుచోట్ల అంతరాయం ఏర్పడింది. పట్టణంలో పల్లపు ప్రాంతాలు నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ముసురు ప్రభావంతో కార్మికులకు పనులు లేక ఇబ్బందులు పడ్డారు. గణపతి నవరాత్ర మండపాల వద్ద పూజలకు అంతరాయం కలిగింది.